ప్రమోటర్స్ ఎవరికి పనిచేశారు..!

నిర్వాహకుల వివరాల సేకరణ
న్యాయ సలహా మేరకు వారిపై కేసులు
సోషల్‌మీడియాలో ప్రమోటర్స్ చేసిన యాప్స్ వివరాలు
మరోసారి విచారణకు హాజరుకాని విష్ణుప్రియ, రీతూచౌదరి

సిటీబ్యూరో/ఖైరతాబాద్, మార్చి 25(నమస్తే తెలంగాణ): బెట్టింగ్ యాప్స్ కేసును పోలీసులు స్పీడప్ చేశారు. మంగళవారం బెట్టింగ్ యాప్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకున్నది. సినీయాక్టర్స్, యూట్యూబర్స్, ఇన్‌ఫ్లూయెన్సర్లు ప్రమోట్ చేసిన యాప్‌లను పోలీసులు గుర్తించారు. వీటికి సంబంధించి వివరాలు సోషల్‌మీడియాలో తిరుగుతున్నాయి. జంగిల్ రమ్మి యాప్ కోసం రానా, ప్రకాశ్‌రాజ్, ఏ23 యాప్‌కోసం విజయ్‌దేవరకొండ, యోలో 247 యాప్ కోసం మంచులక్ష్మి, ఫెయిర్ ప్లే లవ్‌కోసం హీరోయిన్ ప్రణీత, జీట్‌విన్‌యాప్ కోసం నిధి అగర్వాల్, ఆంధ్ర 365 యాప్ కోసం శ్యామల, హర్షసాయి, విష్ణుప్రియ, రీతూ చౌదరి, టీస్టీ తేజ, బయ్యసన్నీలు పలు యాప్‌లకు ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిన్న 19 యాప్‌లపై కేసులు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. ఇవాళ ఈ యాప్‌లకు ప్రమోట్‌చేసినవారి వివరాలు, వారి ఆదాయాల వివరాలను సేకరించి వాటి ద్వారా నిర్వాహకులపై పకడ్బందీగా కేసులు నమోదు చేయాలని చూస్తున్నట్లు తెలిసింది.

న్యాయ సలహాతో..

బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన నటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లకు నోటీసులిచ్చి విచారించే ముందు పోలీసులు న్యాయ సలహా తీసుకున్నట్లు సమాచారం. బెట్టింగ్‌పై తెలంగాణలో నిషేధం ఉన్నప్పటికీ.. నిర్వాహకులు వేర్వేరు పేర్లతో బెట్టింగ్ యాప్‌లను విస్తృతంగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అన్నిటికి మూలం యాప్‌లే కాబట్టి వాటి నిర్వాహకులను కూడా నిందితులుగా చేర్చి విచారణకు పిలవాలని నిర్ణయించారు. ఎవరు తెలంగాణ నిబంధనలను ఉల్లంఘించారో వారిని విచారించి ఆ తర్వాత వారిపై కేసులు నమోదు చేయడానికి డిసైడయినట్లు సమాచారం.

విచారణకు హాజరుకాని రీతూచౌదరి

మరోవైపు విష్ణుప్రియ, రీతూచౌదరి మంగళవారం పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరుకాలేదు. వీరిద్దరికీ మంగళవారం విచారణకు హాజరుకావాలని పోలీసులు చెప్పినా వారు రాలేదు. విష్ణుప్రియ తనపై మియాపూర్, పంజాగుట్ట పోలీసు స్టేషన్లలో రెండు కేసులు పెట్టారని, ఇవి స్క్వాష్ చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించింది. రీతూ చౌదరి అసలు విచారణకే రాలేదు. మరికొందరు మొదటిదశ విచారణకు కూడా రాకపోవడంతో వారి విషయంలో పోలీసులు ఏం చేయాలనే దిశగా న్యాయవాదులతో సలహా తీసుకుంటున్నారు. ఇద్దరు ముగ్గురు విదేశాల్లో ఉండటంతో వారిని కూడా ఎలా రప్పించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. నిర్వాహకుల వివరాలు తీసుకున్న తర్వాత వారిపై కేసులు పెట్టే క్రమంలో ప్రమోటర్స్‌ను సాక్షులుగా మారిస్తే వీరు చివరి వరకు నిబద్ధతతో నిలబడతారా అనే కోణంలో పోలీసులు చర్చిస్తున్నారు.

మాట్లాడుతున్న కనకాల శ్యామ్‌కుర్మా, తాటికొండ విక్రమ్‌గౌడ్

ఆర్ కృష్ణయ్య.. రాజీ కృష్ణయ్య

బీసీలకు క్షమాపణ చెప్పాలి..
ఐక్య బీసీ సంఘాల నేతల హెచ్చరిక

రవీంద్రభారతి, మార్చి 25: నాలుగు దశాబ్దాలుగా బీసీ నేతగా బీసీ ఉద్యమాలు చేస్తున్నానని చెప్పుకుంటూ, అగ్రకుల ప్రభుత్వాలతో కొట్లాడకుండా బీసీ ఉద్యమాలను తాకట్టు పెట్టి వ్యక్తిగత పదవులు పొందిన ఘనత బీజేపీ నాయకుడు ఆర్.కృష్ణయ్యకే దక్కిందని, అందుకే ఆయన త్యాగ కృష్ణయ్య..రాజీ కృష్ణయ్య అని ఐక్యవేదిక బీసీ సంఘాల నేతలు ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ విద్యార్థి, యువజన, సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడారు. బీసీ ఉద్యమాలను అనునిత్యం తాకట్టు పెట్టిన వారే.. బీసీల కోసం నిజాయితీగా పనిచేస్తున్వ వారిని దొంగలుగా చిత్రీకరించాలని చూస్తున్నారని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల ముఖ్య నాయకులపై ఆర్.కృష్ణయ్య తన అనుచరులను ఉసిగొల్పుతూ అసభ్య పదజాలంతో దూషిస్తూ రాళ్లతో కొట్టి, మాఫియాతో చంపిస్తామంటూ బహిరంగంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆర్ కృష్ణయ్య తన అనుచరులతో బెదిరింపులు ఆపకపోతే త్వరలోనే హైదరాబాద్‌లో బీసీ మేధావులు, కులసంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలతో కలిసి బీసీ దర్బార్ ఏర్పాటు చేసి కృష్ణయ్య చీకటి మాఫియా రాజకీయాలను, భూదందాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమాజానికి వివరిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. రావులకోల్ సరేశ్ ప్రజాపతి, సింగం సురేశ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నరసింహనాయక్, శ్రీనివాస్‌గౌడ్, మాదేశి రాజేందర్, నాగ రాజుగౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సిటీబ్యూరో, మార్చి 25(నమస్తే తెలంగాణ): వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులకు భద్రత నుంచి ఆర్థిక సాయాన్ని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అందించారు. ఇటీవల అబ్దుల్లాపూర్ మెట్ ఠాణాలో పనిచేసే కానిస్టేబుల్ హరీశ్‌బాబు అనారోగ్యంతో, అంబర్‌పేట ఆర్మ్‌డ్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేసే కానిస్టేబుల్ బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబాలకు ఎల్బీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రాచకొండ సీపీ భద్రత కింద అందించే ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. హరీశ్‌బాబు భార్య ప్రియాంక, ఆమె పిల్లలు, బాలకృష్ణ తల్లిదండ్రులు ఈ చెక్కులను అందుకున్నారు. అదనపు డీసీపీ(అడ్మిన్), శివకుమార్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.భద్రారెడ్డి పాల్గొన్నారు.

మాధవి హత్య కేసులో ఛార్జీషీట్ సిద్ధం

పోలీసులకు అందిన డీఎన్‌ఏ రిపోర్టు
భార్య మృతదేహాన్ని ముక్కలు చేసి కాల్చేసిన భర్త

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీర్‌పేట్ వెంకట మాధవి హత్య కేసులో పోలీసులు పకడ్బందీగా ఛార్జీషీట్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు డీఎన్ఏ, ఫోరెన్సిక్ నివేదికలు పోలీసులకు అందినట్లు తెలిసింది. భార్య మృతదేహం ఆనవాళ్లు లేకుండా చట్టానికి చిక్కకుండా ఉండేలా ప్లాన్ చేసి, కిరాతకంగా సంక్రాంతి పండుగ వేళ భార్యను చంపి ఆ తరువాత శరీర భాగాలను ముక్కలుగా నరికి స్టౌవ్‌పై కాల్చి బూడిద చేసి, కొన్ని చెరువులో పడేసిన గురుమూర్తి ఉదంతం అందరికి తెలిసిందే. ఈ కేసులో మృతదేహానికి సంబంధించిన ఆధారాలు దొరకకుండా నిందితుడైన గురుమూర్తి పక్కాగా చేసినా ఆ ప్లాన్ బెడిసికొట్టింది. పోలీసులకు సంఘటనా స్థలంలో పలు రకాలు మృతురాలికి సంబంధించిన ఆధారాలు సేకరించారు. ఆమె తల్లీ పిల్లలకు సంబంధించిన నమూనాలను సేకరించి డీఎన్ఏ పరీక్షలకు పంపించగా.. ఆ నమూనాలన్ని సరిపోలినట్లు తెలిసింది. దాంతో పాటు పోలీసులు సేకరించిన వివిధ రకాలైన ఆధారాలకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికలు కూడా అందినట్లు సమాచారం. ఈ నివేదికలను పోలీసులు కోర్టుకు సమర్పించనున్నారు. దాంతో పాటు ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు సేకరించిన పూర్తి ఆధారాలు, సాక్ష్యాలతో ఛార్జీషీట్‌ను తయారు చేసి కోర్టులో సమర్పించనున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల సంచలనాత్మకమైన కేసుల్లో తీర్పులు వేగంగా వెలువడుతున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో వేగంగా కేసుల దర్యాప్తును పూర్తి చేస్తూ పక్కగా ఆధారాలు కోర్టులకు సమర్పిస్తున్నారు. దీంతో ఆయా కేసుల్లో నిందితులకు పక్కాగా శిక్షలు పడుతున్నాయి. నిందితులు శిక్షల నుంచి తప్పించుకోవడానికి వేస్తున్న ఎత్తులను పోలీసులు తమ వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో తిప్పికొడుతూ ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ కేసులో నిందితుడైన గురుమూర్తి తన భార్య మృతదేహం ఆధారం లభించకుండా ఉంటే తనను చట్టం పట్టుకోదనే భ్రమలో భార్యను హత్య చేశాడు. ఆయా నివేదికలు పోలీసులు ఆయా విభాగాల నుంచి అందుకోవడంతో ఇక ఛార్జీషీట్‌పై దృష్టి పెట్టారు.

బాలికపై లైంగిక దాడి

నిందితుడిపై పోక్స్ కేసు నమోదు..రిమాండ్

హిమాయత్ నగర్, మార్చి25: ప్రేమ పేరుతో ఓ బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిని మంగళవారం నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఇన్ స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం.. నారాయణగూడ పీఎస్ పరిధిలో నివాసం ఉండే ఓ బాలిక స్థానికంగా ఉన్న ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నది. నారాయణగూడ, దత్తానగర్ కు చెందిన చతుర్వాల రోహిత్ సింగ్(21) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల కిందట రోహిత్ సింగ్‌కు ఆ బాలికతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ఆసరా చేసుకుని బాలికకు ప్రేమిస్తున్నానంటూ వెంట పడుతూ వేధింపులకు పాల్పడుతు న్నాడు. ఈనెల 23న బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు పిలిపించిన రోహిత్ సింగ్ ముషీరాబాద్ కు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహిత్‌సింగ్‌ను పోలీసులు విచారించగా..నేరాన్ని ఒప్పుకున్నాడు. బాలికను భరోసా సెంటర్ కు తరలించి వాంగ్మూలం రికార్డు చేయగా.. లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. అతడిపై పోక్స్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్ స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

కోట్లాది రూపాయల మోసగాడు స్టీవ్ అరెస్టు

శేరిలింగంపల్లి, మార్చి 25: బంగారం కొనుగోలు చేస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న ఘరాన మోసగాడిని సైబరాబాద్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇటీవల గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యాపారులను బురిడీ కొట్టించి 50 తులాల బంగారం బిస్కెట్లు, 18 వేల అమెరికన్ డాలర్లతో నిందితుడు ఉడాయించిన ఘటన తెలిసింది. కేసు విచారణలో నిందితుడు పలువురు వ్యాపారులు, రాజకీయ నాయకులను కూడా మోసం చేసినట్లు వెల్లడయ్యింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బడా హోటళ్లలో బస చేసిన వారి వద్దకు వెళ్లి నార్సింగికి చెందిన బంగారం వ్యాపారి చంద్రశేఖర్ బంగారం విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 20వ తేదీన చంద్రశేఖర్ గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ సమీపంలోని సితార హోటల్ వద్దకు వెళ్లాడు. అక్కడ స్టీవ్ గాడ్ విన్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తన వద్ద బారీగా డబ్బుందని, దానితో బంగారం, డాలర్లు కొనేందుకు ప్రయత్నిస్తున్నాని, మీరు నాకు సహాయం చేస్తే మంచి కమీషన్ ఇస్తానంటూ నమ్మించాడు. అతడి మాటలు విన్న చంద్రశేఖర్ బంగారంతో, తన స్నేహితుడై రఫీ అమెరికన్ డాలర్లతో 21వ తేదీన స్టీవ్‌గాడ్‌ను కలిసేందుకు వెళ్లారు. సెంట్రల్ మాల్‌లోని 4వ అంతస్తులో ఓ అద్దాల గదిలోపలికి యాక్సెస్ కార్డుతో ఆ ఇద్దరిని తీసికెళ్లిన స్టీవ్ వారితో కొద్దిసేపు మాట్లాడాడు. చంద్రశేఖర్, రఫీలు తమ వద్ద ఉన్న 50 తులాల బంగారం, 18వేల అమెరికన్ డాలర్లను స్టీవ్‌కు అందించారు. తాను లోపలికి వెళ్లి డబ్బు తెస్తానంటూ అద్దాల గదిలో నుంచి స్టీవ్ బయటకు వెళ్లాడు. అయితే స్టీవ్ వస్తాడని కొద్దిసేపు అక్కడే కూర్చున్నారు. బయటకు వెళ్లి చూద్దామనుకునే సరికి డోర్ లాక్ పడింది. యాక్సెస్ కార్డుతో స్టీవ్ అక్కడి నుంచి పరారయ్యాడు. కొద్దిసేపటికి అందులో నుంచి బయటపడ్డ చంద్రశేఖర్, రఫీలు తాము మోసపోయామని గ్రహించి వెంటనే గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది.

వివరాలు వెల్లడిస్తున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

ఫిర్యాదుదారుడే నిందితుడు

రూ.5లక్షలున్న బ్యాగ్ ఎత్తుకెళ్లారని
పోలీసులకు తప్పుడు ఫిర్యాదు
ఛేదించిన బోయిన్‌పల్లి పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 25(నమస్తే తెలంగాణ): తమను పోలీసుల రూపంలో వచ్చి మోసం చేసి రూ.ఐదు లక్షల నగదును ఎత్తుకెళ్లారంటూ అరుణ్‌కుమార్ బెహరా అనే వ్యక్తి చేసిన తప్పుడు ఫిర్యాదును బోయిన్‌పల్లి పోలీసులు ఛేదించారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్లో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, సీఐ లక్ష్మీనారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 22వ తేదీన రాత్రి గాంధీయన్ ఐడియాలజీసెంటర్‌లో తన బ్రాంచ్ మేనేజర్ సూచనల మేరకు తన అసిస్టెంట్ మేనేజర్‌కు క్యాష్ బ్యాగ్‌ను ఇవ్వడానికి వెళ్తుండగా..పోలీసుల వేషంలో వచ్చిన వారు తనను ఆపి వాహనం ఆర్‌సీ కాగితాలు చెక్ చేసి డబ్బు ఉన్న బ్యాగు ఎత్తుకెళ్లారంటూ అరుణ్‌కుమార్ బెహరా (32)బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఫిర్యాదుదారుడి వాంగ్మూలం నమోదు చేసే క్రమంలో అతడు చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి తమదైన పద్ధతిలో విచారణ చేయగా.. తన సహోద్యోగి సురేంద్ర దాస్(41)తో కలిసి డబ్బు దొంగిలించడానికి ఈ పన్నాగం పన్నినట్లు ఒప్పుకున్నారని అరుణ్‌కుమార్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో తప్పుడు ఫిర్యాదు ఇచ్చి మోసం చేయాలని చూసిన అరుణ్‌కుమార్ బెహరా, సురేంద్రదాస్‌లను అరెస్ట్ చేసి రూ.ఐదు లక్షలను రికవరీ చేశామని పోలీసులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఐ సర్దార్ నాయక్, సిబ్బంది మురళి, రాజేశ్ మనోహర్ శ్రీనివాస్, తులసి దాసు పాల్గొన్నారు.

అప్సర హత్య కేసులో నేడు కోర్టు తీర్పు

సిటీబ్యూరో, మార్చి 25(నమస్తే తెలంగాణ): నగరంలో సంచలనం సృష్టించిన అప్సర హత్య కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెల్లడించనున్నది. ఇప్పటికే ఈ కేసులో వాదనలు పూర్తయ్యాయి. తీర్పు మార్చి 26వ తేదీకి వాయిదా పడటంతో ఈ కేసులో తీర్పు ఎలా ఉండబోతుందనేది అన్ని వర్గాల్లో ఉత్కంఠగా మారింది. 2003 జూన్ నెలలో సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో నివాసముండే వివాహితుడైన అయ్యగారి సాయికృష్ణకు అప్పర(30)తో పరిచయం అయ్యింది. తమిళనాడుకు చెందిన అప్పర తమిళంలో కొన్ని సినిమాల్లోనూ నటించింది. ఆమె కుటుంబం తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు వచ్చి సరూర్‌నగర్ ప్రాంతంలో నివాసముంటుంది. స్థానికంగా ఆలయానికి వెళ్లి వస్తున్న క్రమంలో అప్సరకు సాయికృష్ణతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. సాయికృష్ణకు అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పర పెండ్లి చేసుకోవాలంటూ సాయికృష్ణపై ఒత్తిడి తేవడంతో ఆమెను వదిలించుకోవాలని 2003 జూన్‌లో శంషాబాద్ సమీపంలోని నర్కూడ వద్దకు తీసుకెళ్లి ఆమెను చంపేశాడు. మృతదేహాన్ని కవర్‌లో చుట్టి తన కారులోనే తీసుకొని సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వెనుక ఓ డ్రైనేజీలో పడేశాడు. రెండు రోజుల తరువాత వెళ్లి శంషాబాద్ పోలీసులకు తన అక్క కూతురు కన్పించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాయికృష్ణ వ్యవహారంపై అనుమానాలు రావడంతో లోతుగా దర్యాప్తు చేశారు. దీంతో తానే హత్య చేశానంటూ సాయికృష్ణ పోలీసుల విచారణలో వెల్లడించాడు. మృతదేహాన్ని మ్యాన్‌హోల్ నుంచి బయటకు తీసిన పోలీసులు పూర్తి ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో శంషాబాద్ పోలీసులు శాస్త్రీయ ఆధారాలతో పాటు పక్కా సాక్షాలను కోర్టు ముందుంచారు. ఇరు పక్షాల వాదనలు పూర్తికాగా, తీర్పు బుధవారానికి వాయిదా పడింది.

పాతనగరంలో సవాల్‌గా హెచ్‌సిటీ ప్రాజెక్టు

(మొదటిపేజీ తరువాయి)

అందజేస్తున్నారు. అభివృద్ధి పనులకు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని సేకరించి, నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా ఈ టీడీఆర్‌ను ఇస్తున్నారు. ఏదైన ఒక నిర్వాసితుడు నాలా విస్తరణ వల్ల ఏ మేరకు స్థలాన్ని కోల్పోయాడో, అంతకు నాలుగు రెట్లకు టీడీఆర్ పత్రాలను పరిహారంగా పొందుతాడు. ఉదాహరణకు ఆమీర్‌పేటలో 20 గజాల స్థలాన్ని కోల్పోయిన నిర్వాసితుడు జీహెచ్ఎంసీ ఇచ్చే 80 గజాల టీడీఆర్ పత్రాన్ని తీసుకుని ఇతరులకు విక్రయించుకునే హక్కు పొందుతాడు. టీడీఆర్ పత్రం కలిగిన వారు, జీహెచ్ఎంసీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఇచ్చే అనుమతికి అదనంగా చేపట్టే నిర్మాణ వైశాల్యాన్ని నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఫలితంగా లక్ష రూపాయలు ఇవ్వాల్సిన పరిస్థితుల్లో..టీడీఆర్ ద్వారా అంతకు రెట్టింపు లేదా, తనకు నచ్చిన మొత్తానికి విక్రయించుకుని లాభపడుతున్నారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఆలస్యంగా వస్తుండడంతో ఆస్తుల సేకరణ సందిగ్ధంలో పడింది.

వేడినీళ్ల బకెట్‌లో పడి బాలుడి మృతి

(మొదటిపేజీ తరువాయి)

వేడినీటి బకెట్‌లో పడిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు బన్నీని బయటకు తీసి చూడగా.. ఛాతిభాగం కాలిపోయింది. వెంటనే స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 25న మంగళవారం మరణించాడు. బన్నీ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబసభ్యులు జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాది హత్యకు నిరసనల వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాంపల్లి నుంచి అసెంబ్లీ వరకు పాదయాత్ర చేస్తున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీఎస్‌లో న్యాయవాదులు సునీతయాదవ్, పద్మావతి, చంద్రమోహన్, శ్రీనివాస్, రమణ గౌడ్, మల్లేశ్, వెంకటేశ్ తదితరులు మాట్లాడుతూ..ప్రస్తుతం న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, హత్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సిద్ధార్థ్ ముదిరాజ్, కె.లింగారావు, ఆకుల మల్లేశం తదితరులు న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

కేపీహెచ్‌బీకాలనీ:న్యాయవాదులపై దాడులను అరికట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ మంగళవారం కూకట్‌పల్లి కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ప్రతి కోర్టు వద్ద రక్షణ కోసం లైజనింగ్ పోలీస్ ఆఫీసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ నేతలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాది హత్య కేసు నిందితుడి అరెస్టు

సైదాబాద్, మార్చి 25: పట్టపగలు నడిరోడ్డుపై న్యాయవాది ఎర్రబాపు ఇజ్రాయిల్ ను హత్య చేసిన నిందితుడిని మంగళవారం ఐఎస్ సదన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... చంపాపేట ఈస్ట్ మారుతీనగర్ శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో ఎర్రబాపు ఇజ్రాయిల్ (56) నివాసముంటున్నారు. అదే అపార్ట్మెంట్లో వాచ్‌మన్‌గా గా పనిచేసే కాంతారావు, భార్య కళ్యాణితో గత కొంతకాలంగా మారుతీనగర్ కు చెందిన ఎలక్ట్రిషన్ గులాం దస్తగిరి (46) వివాహేతర సంబంధం కలిగిన ఉన్నాడు. దీంతో దస్తగిరి తప్పులను ఎత్తి చూపినందుకు న్యాయవాది ఇజ్రాయిల్ పై కక్ష పెంచుకుని హత్య చేసినట్లు తెలిపారు. వివాహేతర సంబంధం కలిగిన మహిళతో న్యాయవాది చనువుగా ఉన్నాడని కక్షతో పథకం ప్రకారం హత్య చేసినట్లు పోలీసులు ధ్రువీకరించారు. నిందితుడి నుంచి కత్తి , ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి కుమార్తె ధ్రాక్షవల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుడు గులాం దస్తగిరిని రిమాండ్ కు తరలించారు. సౌత్ అదనపు డీసీపీ టి.స్వామి, సంతోష్ నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ పర్యవేక్షణలో ఐ ఎస్ సదన్ ఇన్స్పెక్టర్ నాగ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు చేతిలో తండ్రి హత్య

చర్లపల్లి, మార్చి 25:కుటుంబ కలహాలతో తండ్రిని ఓ కొడుకు హత్య చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన ప్రకారం.. కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని సాయినగరలో నివాసముండే పాత్లవత్ శంకర్(54)ఆటో నడుపుతూ నివాసముంటున్నాడు. కాగా, మంగళవారం ఇంట్లో కుటుంబ కలహాలతో కుమారుడు జగదీశ్ తండ్రి శంకర్‌ను గొంతు నుమలమడంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శంకర్‌ను పరీక్షించగా..అప్పటికే మృతి చెందాడు. పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గందరగోళంగా ఎల్ ఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

కూడా వెంచర్లలోకి చొచ్చుకువస్తున్నాయి. పరిశీలించకుండానే ఫీజులు చెల్లించాలనే సమాచారాన్ని చూసి దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడో తక్కువ ధరకు వస్తుందని జీపీ లే అవుట్లలో కొనుగోలు చేస్తే,లేఅవుట్‌లో కనిపించిన అభ్యంతరాలు..ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల్లో కనిపిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

అప్లికేషన్ ఇంకా ఎల్ -1 దశలోనే ఉంది..

మేడ్చల్ జిల్లాలోని బోడుప్పల్ సమీపంలోని ఓ కాలనీ పరిధిలో ఓ వ్యక్తి 250 గజాల ఖాళీ జాగాను 8 ఏళ్ల కిందట కొనుగోలు చేశారు. అయితే ఆ వెంచర్ జీపీ లే అవుట్లలో ఉందని చెప్పడంతో ఎల్ఆర్ఎస్ కట్టుకునే వెసులుబాటు కల్పించడంతో 2020లో ఫీజు చెల్లించి నమోదు చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ దరఖాస్తుల్లో ఎలాంటి పురోగతి లేదు. కానీ తాజాగా ఫైల్ పురోగతిని ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చూడగా... అప్లికేషన్ ఇంకా ఎల్1 దశలోనే ఉందని, నిషేధిత, శిఖం భూముల్లో వెంచర్ నిర్మాణం కారణంగా ఫీజు ఇంటిమేషన్ చేయలేదని అధికారులను ఆశ్రయిస్తే తెలిసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం తన లే అవుట్‌కు దాదాపు అర కిలోమీటర్ దూరంలో కూడా చెరువు, కుంట లేదని తెలుసుకున్నాడు. స్థానికంగా ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారుల ద్వారా మరోసారి నిజనిర్ధారణ చేసుకునే క్రమంలో.. అసలు ఆ ప్రాంతంలో ఎలాంటి జలవనరులు కూడా లేవని తేలింది.

– అదేవిధంగా సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చిద్రుప్ప గ్రామ పరిధిలో ఓ జీపీ అనుమతులతో భారీ వెంచర్ డెవలప్ చేసి, రూ.10వేలు చెల్లించి వెంచర్ మొత్తాన్ని క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇప్పుడు ఆ అప్లికేషన్‌పై ఎలాంటి లావాదేవీలు లేవని వెబ్‌సైట్‌లో చూపుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో ఫీజు ఇంటిమేషన్ డౌన్‌లోడ్ చేయగా.. రూ.–19,236 లు చెల్లించాలని